17062025-MAI-04_Layout 1 6/17/2025 12:58 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు

పశ్చిమాసియా మరోసారి యుద్ధోన్మాదంలో చిక్కుకున్నది. ఓ వైపు గాజా రాచపుండు మాననే లేదు, ఇంతలోనే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య సంకుల సమరం రాజుకుంటున్నది. ఇరాన్‌లోని అణు పరిశోధన కేంద్రాలతో తన అస్తిత్వానికి ముప్పు ఉందంటూ ఇజ్రాయెల్ మొదలుపెట్టిన బాంబుల వర్షం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరాన్ క్షిపణులతో, డ్రోన్లతో జరుపుతున్న ఎదురుదాడులతో ఇజ్రాయెల్‌కూ భారీగా నష్టం వాటిల్లుతున్నది. రెండు దేశాల్లో యుద్ధం వల్ల విధ్వంసం, ప్రాణనష్టం చోటుచేసుకోవడం విచారకరం. గతంలో ఇరాన్ అణుకేంద్రాలు, అణుశాస్త్రవేత్తలు లక్ష్యంగా ఇజ్రాయెల్ వ్యూహాత్మక దాడులు జరపడం తెలిసిందే. ఈసారి అలాకాకుండా పూర్తిస్థాయిలో ఇరాన్ అణుస్థావరాలే కాకుండా ప్రభుత్వ, సైనిక కేంద్రాలపైనా నెతన్యాహూ ప్రభుత్వం దాడులు జరుపుతున్నది. తాజాగా ఇరాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీసే లక్ష్యంతో చమురు క్షేత్రాలపైనా దాడులు జరుపుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. యుద్ధ ప్రభావం వల్ల చమురు ధరలు పెరిగే ప్రమాదం తొంగిచూస్తున్నది. పశ్చిమాసియాలో కీలక సముద్ర, వాయుమార్గాలు ప్రభావితం అవుతుండటంతో వాణిజ్య రవాణా వ్యవస్థ దెబ్బతింటుండటం మరో సమస్య.

పశ్చిమాసియాలో అనైక్యతకు ప్రతిబింబంలా ప్రపంచ స్పందన కూడా మిశ్రమంగా ఉంది. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలో అమెరికా, బ్రిటన్ తమ యుద్ధనౌకలను, సైన్యాలను పశ్చిమాసియాలో మోహరిస్తున్నట్టు వచ్చిన వార్తలతో మూడో ప్రపంచ యుద్ధం అనివార్యమా అనే భయాందోళనలు వ్యక్తమయ్యాయి. తర్వాత అమెరికా తనకు ఈ యుద్ధంతో ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేయడం వేరే విషయం. అయితే సర్వం నాశనమయ్యే వరకు వేచిచూడకుండా సత్వరమే ఇరాన్ ఒప్పందానికి రావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. ఇజ్రాయెల్ దగ్గర అమెరికాలో తయారైన ప్రమాదకరమైన ఆయుధాలు ఉన్నాయని చెప్పడం పరోక్ష హెచ్చరికలకు దిగడమే అవుతుంది. రెండు దేశాలతో సన్నిహిత సంబంధాలున్న భారత్ ఆచి తూచి స్పందించాల్సి వస్తున్నది. రష్యా, చైనాలతో కూడిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ జారీచేసిన ప్రకటన నుంచి భారత్ వైదొలగడం రెండు వైరిపక్షాలతో సమానదూరం పాటించాల్సిన ఆవశ్యకతను ఎత్తిచూపుతున్నది.

ఇప్పటివరకైతే ఇరుపక్షాలూ వెనుకకు తగ్గుతున్న సూచనలు కనిపించడం లేదు. ఇలాంటి యుద్ధాలను నివారించేందుకు ఏర్పడిన ఐక్యరాజ్య సమితి క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోయి ప్రకటనలకే పరిమితమైపోయిన దుస్థితి. మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్ పట్ల అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అనుసరిస్తున్న ద్వంద్వవైఖరి అణువివక్షకు దారితీస్తున్నది. ఈ చిక్కు సమస్యలు ప్రపంచాన్ని పదేపదే ప్రమాదం అంచులకు తీసుకువెళ్తున్నాయి. సంపూర్ణ అణు నిరాయుధీకరణ సాధించి, సమితిని బలోపేతం చేయడం ఒక్కటే దీనంతటికీ సరైన పరిష్కారం. కానీ, ఆ దిశగా అడుగులు పడకపోవడమే అసలు సమస్య. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అశాంతి, అస్థిరత కొనసాగుతున్న సైనిక ఘర్షణలు మరో ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా? కాలమే జవాబు చెప్పాలి.

ఒక్క సవాలుకైనా నిలవాలి గదా?

టంకశాల అశోక్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తన మంత్రులు ఒకటి కాకుంటే ఒక సవాలుకైనా నిలవగలరేమోనని గత ఏడాది కాలంగా ఎదురుచూస్తుండగా వారు ఇంతవరకు ఏ ఒక్కదానికీ నిలవడం లేదు. ప్రతిపక్షాల సవాళ్లకే కాదు, స్వయంగా తాము విసిరే సవాళ్లపై కూడా బహిరంగ చర్చకు రమ్మన్నా ముందుకు రాకపోవడం గమనించదగ్గది. అందువల్ల, తాము ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల కలుగుతున్న అప్రతిష్ట ఒకటి కాగా, చర్చకు నిలవలేని సవాళ్లు తాము విసరడం, ఇతరుల సవాళ్లను ఎదుర్కొనేందుకు ముందుకువచ్చే ధైర్యం చేయలేకపోవడంతో మరింత అప్రతిష్టకు గురవుతున్నారు.

వాస్తవానికి రాజకీయవాదుల సవాళ్లు, ప్రతిసవాళ్లకు, బహిరంగ చర్చకు సిద్ధమా? తేదీ, సమయం, స్థలం చెప్పండి? మధ్యవర్తుల పేర్లు సూచించండి తరహా మాటలకు విలువ లేకుండాపోయింది. ఒకప్పుడు అసలు ఇటువంటి సవాళ్లు ఉండేవి కావు. ఉన్నా అతి అరుదుగా. అందుకు కారణం అప్పటి రాజకీయాలు, నాయకుల స్థాయి వేరు. ఆ కారణంగా ఎవరైనా ఆ విధంగా మాట్లాడితే ప్రజలు ఆసక్తిగా వినేవారు. నిజంగానే చర్చ జరుగుతుందేమో, ఎవరేమంటారో, ఏమి విషయాలు బయటకు వస్తాయో, వివాదం ఎట్లా తేలుతుందో అనుకొని ఎదురుచూసేవారు. అటువంటి చర్చలు ఎన్నడూ జరగలేదు. అయినప్పటికీ ఆయా నాయకుల పట్ల ప్రజలకు గౌరవం తగ్గలేదు. ఆ నాయకుల వ్యవహరణాస్థాయి ఆ విధంగా ఉండేది.

> కాలం గడిచిన కొద్దీ ప్రజలకు నాయకుల పట్ల దృష్టి మారింది. గౌరవ విశ్వాసాలు పోతున్నాయి. అందుకు కారణం నాయకులు ఒకవైపు తమ అసమర్థ పాలనతో, ఇంకొకవైపు హామీలను అమలు చేయకపోవడంతో, మరొకవైపు వ్యక్తిగతమైన తీరుతెన్నులతో ప్రజల నమ్మకాన్ని పోగొట్టుకుంటుండటం. ఆ విధంగా గౌరవ విశ్వాసాలను కోల్పోయే వారి సవాళ్లకు మాత్రం విలువ ఎట్లా ఉంటుంది? వారు చేసే సవాళ్లకు ఉండదు, ఇతరుల సవాళ్లకు తాము నిలవగలరని కూడా ప్రజలు భావించరు. ప్రస్తుతం జరుగుతున్నది అదే.

ఇందులో గమనించవలసిన ముఖ్యమైన విషయం మరొకటి ఉంది. తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పడి తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు కేసీఆర్ నాయకత్వాన బీఆర్ఎస్ పాలించినప్పుడు ప్రతిపక్షాల నుంచి కొన్ని విమర్శలైతే వచ్చాయి గానీ బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ సవాళ్లు అంతగా వినరాలేదు. వచ్చినా బలహీనంగా, మొక్కుబడి కోసం అన్నట్లు. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి, అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో అమలైనవి చాలా ఉండగా, కానివి తక్కువ అవటం. రెండు, అసలు హామీ ఇవ్వకపోయినా ఎంతో భారీ పథకాలు అనేకం అమలుకు తెచ్చి ప్రజలను ఆశ్చర్యపరచడం. ఆ విధంగా ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై సవాళ్లు విసిరే ఆస్కారం లేకుండాపోయింది. ఎవరైనా వేసినప్పటికీ పైన అన్నట్లు బలహీనంగా. అంతిమంగా, ప్రజలు విశ్వసించే పరిస్థితీ లేదు.

అటువంటి స్థితిలో బీఆర్ఎస్ ఎందుకు ఓడిందన్నది తప్పకుండా ప్రశ్నే. అందు గురించి చాలా చర్చలు జరిగాయి. వాటన్నింటి సారాంశాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే, అప్పటి పాలనలో స్వల్పస్థాయిలోనైనా కొన్ని పొరపాట్లు జరగగా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మితిమీరిన హామీలు ప్రజలను, ముఖ్యంగా గ్రామీణులను, వారి పేదరికం మూలంగా ఆకర్షించాయి. ఆ తరహా హామీల అమలు సాధ్యాసాధ్యాలను హైదరాబాద్ నగర ప్రజల వలె గ్రామీణులు అంచనా వేయలేకపోయారు. దానితో హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకలలో వచ్చిన కాంగ్రెస్ అనుకూల ఫలితాలే ఇక్కడా కనిపించాయి. ఈ మాట జనాంతికంగా కాంగ్రెస్ వారు కూడా అంగీకరిస్తున్నదే.

ఆ విధంగా ఎన్నికలైతే గెలిచారు గానీ, హామీలు, వాటి అమలు, అందు గురించిన సవాళ్లూ ప్రతిసవాళ్ల దశ ఆ తర్వాత సుమారు ఆరు నెలలు గడిచినప్పటి నుంచి మొదలైంది. ఇక్కడ చర్చిస్తున్నది ఈ దశ గురించే. బీఆర్ఎస్ పాలనాకాలంలో తొమ్మిదిన్నర ఏండ్లపాటు లేనన్ని సవాళ్లు ప్రతిసవాళ్లు కాంగ్రెస్ ఏడాదిన్నరలోనే ఎందుకు తలెత్తుతున్నాయన్నది ప్రాథమికమైన ప్రశ్న. అందుకు జవాబును కనుగొంటే ఇతర ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి. ఇన్నిన్ని సవాళ్లు, ప్రతిసవాళ్లు ఏడాదిన్నరలోనే ఎందుకు వస్తున్నాయంటే, ప్రభుత్వం తన హామీలను అమలు చేయలేకపోతున్నది. పైగా తన వైఫల్యానికి నెపాలు గత ప్రభుత్వంపై వేస్తున్నది. అదే అన్నింటికి మూలం. అమలు వంద రోజుల్లోనే చేయగలమని ఆరంభించినవారు ఆ వంద రోజులు గడిచినాక వాయిదా వేయటాలు మొదలుపెట్టారు.

> వాయిదాల ప్రకారం ఎదురుచూసిన ప్రజలు విసుగెత్తటంతో, చేయకుండానే చేశామంటూ బుకాయించటం సాగించారు. కొన్నింటికైతే అసలు జోలికి పోవడం లేదు. కొన్నింటిని మొదట ప్రకటించిన దానికన్నా కుదించివేశారు. కొన్నింటిని ఒక మేర చేసి పూర్తిగా చేశామనే వాదనలు మొదలుపెట్టారు. కొన్ని అబద్ధాలను మళ్లీ మళ్లీ చెప్తూ, అవి నిజమని ప్రజలు నమ్మగలరనే భ్రమలకు లోనయ్యారు.

ఆ విధంగా తాము సృష్టించుకున్న ఊబిలో తామే చిక్కుకుని, అందులోంచి బయటకు వచ్చే మార్గం లేక, గత ప్రభుత్వపు అప్పుల మూలంగానే హామీలు నెరవేర్చలేకపోతున్నామనే వాదనలు మొదలుపెట్టారు. అప్పుల మాట ఎన్నికల ప్రచార సమయంలోనే తెలుసు గదా అన్న ప్రశ్నలకు సమాధానమివ్వలేకపోయారు. తాము అంటున్న అప్పుల స్థాయికి, రిజర్వ్ బ్యాంకు చెప్పున్నదానికి పోలిక లేదు ఎందువల్ల అని అడిగినా జవాబు లేదు. చివరకు పలు సందర్భాల్లో చర్చలు, స్వయంగా రేవంత్ ప్రభుత్వ బడ్జెట్ పత్రాలు, శ్వేతపత్రాల ద్వారా వాస్తవాలు ఏమిటన్నది ప్రజలకు అర్థమైపోయింది. హామీలు గాని, వాటిని అమలు చేయకుండానే గాని, లేదా పాక్షికంగా మాత్రమే చేసిగాని, అంతా చేసినట్లు దబాయిస్తున్నారన్న మాట ప్రజలకు మొదటి ఆరు నెలలు గడిచిన తర్వాత నుంచి తెలిసివచ్చింది. ఆ విధంగా విశ్వసనీయత అంతర్థానమైంది.

> సవాళ్లు, ఎదురుసవాళ్లు, ప్రతిపక్ష బీఆర్ఎస్ సవాళ్లలో ఒక్కదానికైనా నిలవలేకపోవడం ఆ విధంగా మొదలైంది. ఉదాహరణలు కొద్దిగా చెప్పుకొందాం. రైతులందరికీ పూర్తిగా రుణమాఫీ చేశామన్నది రేవంత్‌రెడ్డితోపాటు ఆయన మంత్రులు కొందరు బయటనే గాక అసెంబ్లీలోనూ పలుమార్లు చేసిన ప్రకటన, వాదన కూడా. దానిపై బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, హరీశ్‌రావులు వేర్వేరు సందర్భాల్లో ఆయన ఎదుటనే మాట్లాడుతూ సూటిగా సవాళ్లు విసిరారు.

రైతు రుణమాఫీ పూర్తిగా జరిగినట్లు మొత్తం రాష్ట్రంలో కాదు గదా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గాని, చివరకు ఆయన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో గాని తేలినట్లయితే తను శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి అసలు రాజకీయాల నుంచే శాశ్వతంగా విరమించుకోగలనని కేటీఆర్ సవాల్ చేయగా, ముక్కు నేలకు రాయగలనని హరీశ్ అన్నారు. ఆయా సమయాల్లో సభలోనే ఉండిన ముఖ్యమంత్రి నుంచి ఎటువంటి స్పందనలు వినిపించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంత అనే ప్రశ్నపై కూడా చర్చల సవాళ్లకు ప్రభుత్వ పక్షం ముందుకురాలేదు. అదే విధంగా ఉద్యోగ నియామకాలు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఆరోపణలకు సంబంధించి కూడా ప్రజలకు ఇటువంటి పరిస్థితి కనిపించింది. ఉదాహరణకు కార్ రేస్ అంశం. విచారణలు, రుజువులు ఏమీ లేకుండానే కేటీఆర్‌పై అవినీతి ఆరోపణలు చేయడం రేవంత్‌రెడ్డికి, తన మంత్రులకు, పార్టీ నాయకులకు ఒక అసమర్థపు క్రీడగా మారింది. ఈ కేసుపై తాను, ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి న్యాయమూర్తి సమక్షంలో గాని, మరెక్కడైనా గాని లైడిటెక్టర్ పరీక్షకు నిలవాలని, ఆ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంలో ప్రజల దృష్టికి వెళ్లాలని, అందుకు సిద్ధమేనా అని కేటీఆర్ ప్రతీసారి సవాలు చేస్తున్నారు. అసెంబ్లీలో చర్చ జరపాలని సైతం కోరారు. ఇందుకు కూడా అవతలి పక్షం నుంచి స్పందన లేదు. కాళేశ్వరం తదితర నీటిపారుదల పథకాలు, ఉద్యోగ నియామక సంఖ్యల విషయంలో కనిపిస్తున్నదీ అదే. రూ.90 వేల కోట్లతో నిర్మించిన పథకంలో లక్ష కోట్ల అవినీతి అంటూ ఆరోపణలు చేసినప్పుడే ప్రజల దృష్టిలో తమ పరువుతో పాటు రాహుల్ గాంధీ పరువు కూడా పోయింది.

మొదట చెప్పుకొన్నట్లు, వెనుకటి తరంతో పోల్చితే ఈ తరం నాయకుల విశ్వసనీయత, గౌరవ మర్యాదలు క్షీణిస్తున్నందున, వారు చేసే సవాళ్లకు కూడా ప్రజలు విలువ ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం తగినంత విశ్వసనీయతను సంపాదించుకున్నందున దానితో పోల్చి చూస్తున్న ప్రజలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్ల గాని, వ్యక్తిగతంగా ఆయన పట్ల గాని ఎటువంటి నమ్మకాన్ని చూపటం లేదు. రెండు వైపుల నుంచి తరచు వినవచ్చే సవాళ్లపైన ప్రజల నమ్మకం కూడా అందుకు అనుగుణంగానే ఉంది. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఎదుటిపక్షం సవాళ్లకు నిలవలేకపోవడమే గాక, స్వయంగా తాము విసిరే సవాళ్లపై చర్చలకు అయినా సిద్ధపడకపోవడం వారికి తమ వైఫల్యాలు, బలహీనతలు ఎటువంటివో బాగా తెలుసుననడానికి రుజువు అవుతున్నది. అధికారపక్షపు ఈ పరిస్థితి ప్రజలకు ఈ సరికి బాగా అర్థమైంది. అందుకే కావచ్చు ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల పట్ల మొదట కొంత ఆసక్తి చూపినవారు క్రమంగా పట్టించుకోవడం మానివేశారు. అది కూడా రేవంత్‌రెడ్డికి మేలే. ప్రజలు పట్టించుకుని చూస్తే తన కష్టాలు మరింత పెరుగుతాయి గనుక. ■

నిందలు వేస్తే కాంగ్రెస్‌కే నష్టం

కన్నోజు మనోహరాచారి
79950 89083

> కాళేశ్వరంపై ఈ రోజు దుష్ప్రచారం చేసేవారికి 2014కు ముందున్న తెలంగాణ గోస తెలియదా? నీళ్లు లేక పంట పొలాలన్నీ నెర్రెలుబారితే బతకడానికి బొంబాయి వెళ్లిన రోజులు మరిచిపోయారా? తినడానికి గడ్డి, తాగడానికి నీళ్లు దొరక్క పశువులు బక్కచిక్కి చనిపోయిన రోజులు గుర్తులేవా? కూటికి, నీటికి పల్లెల్లోని ప్రజలు కన్నీరు పెడుతున్న తీరుని వివరించిన గోరేటి వెంకన్న పాటలను అప్పుడే మరిచిపోయారా? నాడు తెలంగాణలోని ఏ పల్లెలో చూసినా రోదనే కనిపించేది. కరువుకాటకాలతో జనం విలవిలలాడిపోయారు. ఉద్యమంతో సాధించుకున్న తెలంగాణలో మొదటి రెండేండ్లలోనే మిషన్ కాకతీయతో చెరువుల్లో జలకళ వచ్చింది. బీడు భూములు పచ్చగా మారాయి.

కాళేశ్వరం ప్రపంచంలోనే గొప్ప నీటిపారుదల ప్రాజెక్టు అని, కేసీఆర్ సత్సంకల్పంతో తెలంగాణలో నదులకు పునరుజ్జీవనం కల్పిస్తున్నారని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ గతంలో కొనియాడారు. కాళేశ్వరంతో గోదావరి సజీవంగా మారిందని, నదులు ఉన్నచోటే మానవ నాగరికత అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాజెక్టును సందర్శించాక రాజేంద్రసింగ్ చెప్పిన మాటలు చరిత్ర పుటల్లో ఇంకా సజీవంగానే ఉన్నాయి. కాళేశ్వరంపై కొండపల్లి రాజేంద్ర శ్రీవాత్సవ తీసిన 60 నిమిషాల డాక్యుమెంటరీ 'లిఫ్టింగ్ ఏ రివర్' 2021 జూన్ 25న డిస్కవరీ ఛానల్‌లో ప్రసారమైంది. రెండేండ్లపాటు ప్రాజెక్టు నిర్మాణ పనులను ఫాలో అవుతూ, ఇంజినీర్లతో ఇంటర్వ్యూలు చేస్తూ ఆయన వందల గంటల పుటేజ్‌ను రికార్డు చేశారు. ఈ సినిమా బ్యాక్‌గ్రౌండ్ వాయిస్‌లో 'మానవుడు, యంత్రాలు కలిసి రూపొందించిన అద్భుతం కాళేశ్వరం ప్రాజెక్టు. ఒక నదిని అచ్చంగా ఎత్తిపోశారు' అని చెప్తారు. ఒక నది నుంచి 169 టీఎంసీల నీటిని 45 లక్షల ఎకరాలకు చేర్చడం, 30 టీఎంసీల తాగునీటిని అందించడం, 13 జిల్లాలకు ప్రయోజనం కల్పించడం, ప్రాజెక్టులో సుమారు 10 జాతీయ, 5 అంతర్జాతీయ కంపెనీలు భాగస్వామ్యం కావడం, భిన్నమైన భాషలు, జాతీయతలను కాళేశ్వరం ప్రాజెక్టు ఒక దగ్గరకు చేర్చిందని ఇందులో చెప్తారు. ఇదీ కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం.

2016లో శంకుస్థాపన జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు 2019 జూన్ 21న ప్రారంభమైంది. మూడేండ్లలో ఒక మహాద్భుత ప్రాజక్టుతో తెలంగాణలో భూగర్భ జలాలు ఉవ్వెత్తున పెరిగాయి. లక్ష్మి, సరస్వతి, పార్వతి బ్యారేజీలతో పాటు శ్రీరాజరాజేశ్వర, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ లాంటి జలాశయాలు అందుబాటులోకి వచ్చాయి. 240 టీఎంసీల నీళ్లను మన తెలంగాణలోనే వాడుకోవాలని, మన రైతులకే మేలు చేయాలనే తలంపుతో నిర్మించిన ప్రాజెక్టు కాళేశ్వరం. హైదరాబాద్ నగరానికి రేపటికి నీళ్లు అందించేది మల్లన్న సాగరే. 50 టీఎంసీలతో నిర్మించిన ఈ జలాశయం నిండితే హైదరాబాద్ నగరానికి రెండు మూడేండ్ల వరకు తాగునీటికి ఇబ్బంది ఉండదు. ఇవన్నీ కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన ప్రాజెక్టులు. గోదావరిని సజీవంగా ఉంచడమే కాకుండా పూర్వ ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని చెరువులకు నీళ్లు అందించే విధంగా రూపొందించిన ఈ ప్రాజెక్టుపై మొదటినుంచి విషప్రచారం జరుగుతున్నది. ప్రభుత్వం ఒక్క విషయం గుర్తుపెట్టుకోవాలి. తెలంగాణ బతుకు చిత్రాన్ని తిరగరాసిన కాళేశ్వరంపై రాజకీయం చేసినన్ని రోజులు కాంగ్రెస్ పార్టీకే నష్టం. ■



పద్నాలుగేండ్ల ఉద్యమంతో ఆరు దశాబ్దాల ప్రజల ఆకాంక్ష అయిన తెలంగాణను సాధించిన యోధుడు కేసీఆర్. తండ్లాడి తెచ్చుకున్న తెలంగాణను పదేండ్ల పాలనతో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన దార్శనికుడాయన. కేంద్రం సహకారం లేకున్నా, అప్పటి విపక్షాలు విష్రపచారం చేసినా, కేసులతో అడ్డుకోవాలని చూసినా వెనకడుగు వేయకుండా అభివృద్ధి చేసిన పాలకుడు కేసీఆర్.

తేరుకో తెలంగాణ

శ్రీధర్ ప్రసాద్
95054 05950

అబద్ధాల ప్రచారమో, అరచేతిలో వైకుంఠం చూపించిన హామీల ఫలితమో కానీ, హస్తం పార్టీని నమ్మి ప్రజలు ఏమరుపాటుగా ఓట్లేయడంతో కాంగ్రెస్ అధికారాన్ని దక్కించుకుంది. మోసం చేయడం తన డీఎన్ఏలోనే ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కిన వెంటనే హామీలకు మంగళం పాడేసింది. ప్రత్యేక పరిస్థితుల్లో సీఎం పీఠాన్ని దక్కించుకున్న రేవంత్‌రెడ్డి దాన్ని నిలబెట్టుకునేందుకు తన గురువు చంద్రబాబు అండతో ప్రధాని మోదీ పరివారం ముందు మోకరిల్లారు. అదానీకి కాంట్రాక్టులు ఇస్తూ బీజేపీ అడుగులకు మడుగులొత్తుతున్నారు. రేవంత్‌కు సీఎం పదవి ఇచ్చి పెద్ద తప్పు చేశామని కాంగ్రెస్ అధిష్ఠానం చివరికి తెలుసుకున్నా.. ప్రస్తుతం ఆయనను ఆ పదవిలో ఉంచలేని, దించలేని పరిస్థితి.

తెలంగాణలో కాంగ్రెస్ సీఎంగా ఉంటూ తనే నిస్సిగ్గుగా చెప్పుకొన్నట్టు చంద్రబాబు శిష్యుడి రూపంలో తమ స్కూల్ విద్యార్థి కమలం పార్టీకి దొరికారు. అందుకే కాళేశ్వరం మరమ్మతులు ఆగిపోయాయి. ఏడులలో పంప్‌హౌజ్‌లు పూర్తయి, నార్లాపూర్, వట్టెంలలో డ్రై, వెట్ రన్‌లు కూడా పూర్తయి, 90 శాతం పనులు పూర్తయిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పనులు నిలిచిపోయాయి. కృష్ణా, గోదావరిల మీద ఏపీ అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టుల గురించి కాంగ్రెస్, బీజేపీ నేతలు నోరెత్తడం లేదు. కాళేశ్వరం మీద కక్షగట్టి కేంద్రప్రభుత్వ సంస్థతో నివేదికలు ఇచ్చి నిందలు వేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఎస్ఎల్‌బీసీ కూలి ఎనిమిది మంది మరణించినా, సుంకేసుల రిటైనింగ్ వాల్ కూలినా, వట్టెం పంప్‌హౌజ్ నీట మునిగినా దర్యాప్తు చేయట్లేదు, కమిషన్ వేయట్లేదు.

అటవీ చట్టాలను ఉల్లంఘించి హెచ్‌సీయూలో వన్యప్రాణులకు ఆవాసం లేకుండా చేసినా, మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో పేదల ఇండ్ల మీదకు బుల్డోజర్లు తోలినా, లగచర్ల రైతుల మీద పగబట్టి జైలుకు పంపినా, ఇథనాల్ కంపెనీ పేరిట నడిగడ్డ రైతులపై దండెత్తినా కేంద్రం స్పందించడం లేదు. కక్షసాధింపు రాజకీయాలతో ముందుకుసాగుతున్న రేవంత్‌కు కుటుంబ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం అసలే పట్టవు. ఇక తెలంగాణ కన్నా ఏపీకే కేంద్రం పది రెట్లు అధికంగా నిధులు ఇచ్చిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పుకోవడం శోచనీయం.

> 'జై తెలంగాణ' అని నినదించలేని వ్యక్తి ఈ రాష్ట్ర పాలకుడిగా ఉండటం, పాఠశాల పుస్తకాల నుంచి ఉద్యమ పాఠాలను తొలగించడం తెలంగాణ కోరి తెచ్చుకున్న దౌర్భాగ్యం. కేసీఆర్ పాలన మీద విష్రపచారం చేసి, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పదవులు సంపాదించి కలుగుల్లో దాక్కున్న కుహనా మేధావుల గురించి, రేవంత్ నజరానాలకు ఆశపడి పెదవులు మూసుకున్న వాళ్ల గురించి మాట్లాడుకోకపోవడమే ఉత్తమం.

అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా పాత చింతకాయ పచ్చడి ఆరోపణలతో ప్రజల దృష్టిని రాష్ట్ర పాలకులు మళ్లిస్తున్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పక్కనపెట్టారు. హామీలను అటకెక్కించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొన్నాళ్లు ఉండి దిగిపోతాయి. కానీ, తెలంగాణ ప్రయోజనాలు, హక్కులు ఒక్కసారి చేజారాక తిరిగి సాధించడం కష్టం. అందుకే తెలంగాణ సమాజం కాంగ్రెస్, బీజేపీ కుట్రలను గుర్తించి ప్రశ్నించాలి. తెలంగాణకు ఎవరి వల్ల మేలు జరుగుతుందో గుర్తెరిగి, వారికి అండగా నిలవాలి. ప్రాంతాన్ని ప్రేమించలేనివాడు జాతిని, జాతీయవాదాన్ని ప్రేమించలేడు. ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని బలహీనపరిచి జాతీయవాదం పేరుతో దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తున్న శక్తుల పట్ల మనందరం అప్రమత్తంగా ఉండాలి.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

బంజారాలకు పదవేది?

ఇరవై ఏండ్ల పోరాట ఫలితంగా బంజారాలకు 1976లో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు దక్కాయి. నాటి నుంచి కాంగ్రెస్ పాలనలో మంత్రిమండలికి బంజారా జాతి ప్రాతినిధ్యం వహించింది తొమ్మిదేండ్ల ఐదు నెలలు మాత్రమే. టీడీపీ పదిహేడు ఏండ్ల పాలనలో 1989లో ఎన్టీ రామారావు మంత్రివర్గంలో అజ్మీరా చందులాల్‌కు మంత్రిగా అవకాశం దక్కింది. ఆ తర్వాత 1995-2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏనాడూ బంజారా జాతికి తన మంత్రిమండలిలో అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు ఆయన దారిలోనే తన శిష్యుడు రేవంత్‌రెడ్డి కూడా నడుస్తుండటం గమనార్హం.

ఇస్లావత్ రాంచందర్ నాయక్
98498 25386

తెలంగాణలో సుమారు ఏడు శాతం జనాభా ఉన్న బంజారాలకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేని సందర్భాలు రెండే రెండు. ఒకటి, చంద్రబాబు హయాంలో, రెండు ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో. బంజారా ఓట్లను వాడుకొని అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు బంజారాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. తన మంత్రి మండలిలో బంజారాలకు అవకాశం ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనం.

> పద్నాలుగేండ్ల పాటు తెలంగాణ ఉద్యమంలో బంజారా జాతి కేసీఆర్ వెన్నంటే నిలిచింది. ఆ తర్వాత కూడా పదేండ్ల పాటు గిరిజన బిడ్డలు గులాబీ జెండాకు అండగా నిలబడ్డారు. ఈ విషయాన్ని గ్రహించిన కేసీఆర్ రెండు పర్యాయాలు తన మంత్రివర్గంలో బంజారాలకు అవకాశం కల్పించారు. మొదటి పర్యాయం అజ్మీరా చందులాల్, బీఆర్ఎస్ రెండోసారి అధికారం చేపట్టాక సత్యవతి రాథోడ్ మంత్రులుగా బంజారా జాతికి ప్రాతినిధ్యం వహించారు. ఇద్దరు కలిసి ఏడేండ్ల 9 నెలల పాటు మంత్రులుగా సేవలందించారు.

బీఆర్ఎస్ పాలనలో బంజారాల అభ్యున్నతికి కేసీఆర్ ఎంతో కృషి చేశారు. ప్రభుత్వం తరఫున నిధులు కేటాయించి బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించారు. బంజారాహిల్స్‌లో సేవాలాల్ పేరిట ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించారు. 'మా తండాలో మా ర